# ‘నామినేషన్’ ఏర్పాట్లు పూర్తి చేయండి

- పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలి
- ఒకరు 4 నామినేషన్ సెట్లు వేయవచ్చు..
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు స్వీకరణ
- అభ్యర్థి వెంట నలుగురికి మాత్రమే అనుమతి
- బారికేడ్లు ఏర్పాటు చేయాలి: కలెక్టర్ వల్లూరు క్రాంతి
- రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

గద్వాల, అక్టోబర్ 28 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో చేపట్టే నామినేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు చేయాలని, ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ హాల్‌లో రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో నామినేషన్ల పరిశీలన, ఫారం–7ఏ దరఖాస్తు ప్రిపరేషన్‌పై మాట్లాడారు. నామినేషన్ల స్వీకరణ, వాటి పరిశీలన, ఉపసంహరణ వంటి అంశాలు కీలకమైనవని, వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. నామినేషన్ ప్రక్రియ కోసం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సిబ్బంది ఏఏ పనులు నిర్వహించాలనేది ముందుగానే సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నామినేషన్ వేసే కార్యాలయంలో రెండు కంప్యూటర్లతోపాటు స్కానర్, ఫ్యాక్స్, నాలుగు సెట్ల ఓటర్ జాబితా, సీసీ టీవీ, వీడియోగ్రాఫర్, వాల్‌క్లాక్ పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, మైక్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అకౌంట్ రిజిస్టర్, స్పీడ్ ఎక్కువగా ఉన్న ఇంటర్నెట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. నామినేషన్ వేసే సమయంలో ప్రజలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్ పరిశీలన రోజుకు అభ్యర్థికి 25 ఏండ్లు నిండి ఉండాలన్నారు. ఒక అభ్యర్థి నాలుగు నామినేషన్ సెట్ల వరకు వేయవచ్చన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 3గంటల వరకు నామినేషన్ స్వీకరణ ఉంటుందని, ఆ తర్వాత స్వీకరించబడవన్నారు. మూడుగంటల లోపు వచ్చిన వారికి రిటర్నింగ్ అధికారి సంతకం చేసిన స్లిప్ అందించాలన్నారు. నామినేషన్ వేసిన సమయాన్ని అధికారులు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5వేలు, మిగతా వారికి రూ.10 వేలు ధరావత్ చెల్లించాలన్నారు. నిబంధనల మేరకు అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీయించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాసులు, అపూర్వచౌహాన్, ఆర్డీవో చంద్రకళ పాల్గొన్నారు.

# అమరుల త్యాగం మరువలేనిది

- ఎస్పీ రితిరాజ్
- బెటాలియన్ నుంచి గద్వాల పాత బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ
- హాజరైన కమాండెంట్ సాంబయ్య


గద్వాల పట్టణంలో ద్విచక్రవాహన ర్యాలీలో పాల్గొన్న పోలీసు సిబ్బంది


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, అక్టోబర్ 28 : అమరుల త్యాగం మరువలేనిదని ఎస్పీ రితిరాజ్, బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం బెటాలియన్ సిబ్బంది జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ, బెటాలియన్ కమాండెంట్ మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ముందుకు సాగుతున్న పోలీసుల కృషి అభినందనీయమన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజా క్షేమం కోసం పనిచేస్తూ అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేలా ప్రతి ఏడాది ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సాయుధదళ డీఎస్పీ ఇమ్మాన్యుయేల్, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ నాగభూషణం, గద్వాల సీఐ శ్రీనివాస్, బెటాలియన్ అర్ఐ రాజు, వెంకటేశ్వర్లు, రాజారావు, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

**లక్ష్యంతో ముందుకు సాగాలి**

విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని ఎస్పీ రితిరాజ్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విధి నిర్వహణలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్ స్టేషన్ అవరణలో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై భరోసా, షీటీం, డాగ్ స్క్వాడ్, ఆయుధ ప్రదర్శనను పరిశీలించారు. విద్యార్థులు చదువును మధ్యలో వదిలేయకుండా చివరి వరకు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఇమ్మాన్యుయేల్, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు శ్రీకాంత్, ఆనంద్, షుకూర్ తదితరులున్నారు.

# సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- త్వరలో జిల్లాకు మరిన్ని కేంద్ర బలగాలు
- ఓటర్లు ప్రలోభాలకు లోను కావొద్దు
- స్వచ్ఛందంగా ఓటుహక్కును వినియోగించుకోవాలి
- సోషల్ మీడియాపై స్పెషల్ ఫోకస్..: ఎస్పీ రితిరాజ్

గద్వాల అర్బన్, అక్టోబర్ 28 : జిల్లాలో నవంబర్ 30వ తేదీన అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇన్సిడెంట్ ఫ్రీ అండ్ ఫేర్‌గా ఎన్నికలు నిర్వహించడమే తమ లక్ష్యమని, అందుకు ప్రజలు సహకరించాలని ఎస్పీ రితిరాజ్ కోరారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఇన్సిడెంట్ ఫ్రీగా ఎన్నికలు జరిగేందుకు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను ప్రకటన ద్వారా తెలియజేశారు. జిల్లా పోలీస్ ఫోర్స్‌కు అదనంగా 100మందితో కూడిన సీపీఎఫ్ బలగాలు వచ్చాయని, త్వరలో మరిన్ని బలగాలు వస్తాయన్నారు. పుల్లూరు, నందిన్నె, బల్గెర, ర్యాలంపాడు, సుంకేసుల చెక్‌పోస్ట్‌లు, బీచుపల్లి చెక్‌పోస్టు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టాండ్‌లలో లోకల్ పోలీసులతోపాటు కేంద్ర బలగాలు వాహనాలను తనిఖీ చేస్తున్నారని, జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో, సమాచారం మేరకు తనిఖీలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రజలు రూ.50వేలకు మించి నగదును రవాణా చేసే సమయంలో వాటికి సంబంధించిన రసీదులు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన సమస్యాత్మక ప్రదేశాల్లో కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నాయన్నారు. జిల్లాలో 593 పోలింగ్ కేంద్రాలు, 319 పోలింగ్ లొకేషన్లు ఉండగా సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి ఉంచామన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి చట్టవిరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలలో ప్రజలు ప్రలోభాలకు లోను కాకుండా స్వచ్ఛందంగా ఓటుహక్కును వినియోగించుకోవాలంటూ కళా బృందం, షీటీం సభ్యులు ప్రతి రోజూ గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్పీ వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 782 మందిపై బైండోవర్ కేసులు, 1,902 లీటర్ల మద్యం, 2,700 కేజీల నల్ల బెల్లం, 50 కేజీల క్రిస్టల్ చక్కెరతోపాటు మొత్తం 127 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వాటి విలువ రూ.23లక్షలకు పైగా ఉంటుందన్నారు. 558 చీరలు, 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 2 కార్లు, ఒక బైక్ పట్టుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.38లక్షలకు పైగా ఉండవచ్చని అంచనా వేశారు. అలాగే నగదు రూ.88లక్షలకు పైగా సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి తరలించినట్లు తెలిపారు.


బీఆర్ఎస్ వైపేనంటూ మద్దతు తెలుపుతున్న గ్రామస్తులు

# మేమంతా బీఆర్ఎస్ వైపే..

- కేసీఆర్ వెంటే ఉంటామని తీర్మానించిన సిద్దోనిపల్లివాసులు


తీర్మాన కాపీని జ్యోతికి అందజేస్తున్న బాలిక

కేటీదొడ్డి, అక్టోబర్ 28 : ‘‘మా గ్రామమంతా మీ వెంటే.. మేమంతా కేసీఆర్ పార్టీ కారు గుర్తుకే ఓటు వేస్తాం’’ అని సిద్దోనిపల్లి గ్రామస్తులు తీర్మానం చేశారు. అందుకు సంబంధించిన తీర్మాన పత్రాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి జ్యోతికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని 114మంది ఒకేమాటపై ఉంటూ ఏకగ్రీవ తీర్మానం చేశామన్నారు. తమను ఇంత వరకు కేవలం ఓట్ల కోసం వాడుకున్నారని, ఈ పదేండ్లలో తామందరం బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన పథకాలతో లబ్ధి పొందామని వివరించారు. వేరే ప్రభుత్వం అధికారంలోకి వస్తే తాము అన్యాయం అయిపోతామనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుందరికీ బండ్ల జ్యోతి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులున్నారు.

# గొప్ప వ్యక్తి.. వాల్మీకి మహర్షి

- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ చల్లా

ఉండవెల్లి, అక్టోబర్ 28 : మండలంలోని పుల్లూర్‌లో శనివారం నిర్వహించిన వాల్మీకి జయంతిలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి వేదపండితులతో కలిసి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ రామాయణాన్ని రచించి ప్రజలందరి గుండెల్లో నిలిచిన గొప్ప వ్యక్తి వాల్మీకి అని అన్నారు.

# అందరికీ ఆదర్శం.. వాల్మీకి జీవితం

- అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం


వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అయిజ, అక్టోబర్ 28 : బోయల ఆరాధ్యదైవం వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శనివారం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని వాల్మీకి ఆలయంలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూజలు చేసి మాట్లాడారు. రామాయణం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు వాల్మీకి అని కొనియాడారు. వాల్మీకులకు కుల వృత్తి లేకపోవడంతో నాడు వేట వృత్తిని ఎంచుకున్నారని, ఆ తర్వాత సమాజానికి చేరువయ్యారన్నారు. మనిషి ప్రవర్తన మారితే మహర్షి కాగలడనడానికి వాల్మీకి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, కౌన్సిలర్లు, వాల్మీకి బోయలు పాల్గొన్నారు.

MBA/B.Ed
Seats are available with or without entrance
: 9866958815
9392639172
9866957188